RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 232 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | ఆదివారం, 25 ఫిబ్రవరి 2024 | పేజీలు : 4 | వెల : 2/-




## ఇందిరమ్మ ఇండ్ల వైపు

# వడివడిగా అడుగులు

## గైడ్‌లైన్స్ సిద్ధం చేస్తున్న అధికారులు

హైదరాబాద్ : ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్‌పై రాష్ట్ర సర్కారు దృష్టి పెట్టింది. ఈ పథకం గైడ్‌లైన్స్‌ను రూపొందించే పనిలో హౌసింగ్ అధికారులు నిమగ్నమయ్యారు. ఈనెలాఖరు కల్లా గైడ్‌లైన్స్‌ను ప్రభుత్వానికి అందచేయనున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. ప్రస్తుతం ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఇండ్ల స్కీమ్స్‌పై అధికారులు స్టడీ చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీల్లో ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్ ఎంతో కీలకమైంది.

100 శాతం సబ్సిడీతో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చింది. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, గృహలక్ష్మి స్కీమ్‌ల విషయంలో గత ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.

అధికార పార్టీ కార్యకర్తలకు, ఇండ్లు ఉన్నోళ్లకు, ఎమ్మెల్యేల అనుచరులకు డబుల్ బెడ్రూం ఇండ్లు, గృహలక్ష్మి స్కీమ్ లబ్ధిదారుల లిస్టులో చోటు దక్కిందని ప్రతిపక్షాలు, ప్రజాసంఘాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. గత అనుభవాల నేపథ్యంలో ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఇండ్లు లేని పేదలను గుర్తించి, ఎలాంటి అవకతవకలు జరగకుండా స్కీమ్‌ను అమలు చేసేందుకు ఆఫీసర్లు కసరత్తు చేస్తున్నారు.

**డిప్యూటేషన్‌పై వెళ్లినోళ్లు తిరిగి హౌసింగ్‌కు!** లిహౌసింగ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన సుమారు 450 మంది అధికారులు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలితో పాటు ఇతర శాఖల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. వీరందరిని హౌసింగ్ శాఖకు తీసుకురావాలని, డిప్యూటేషన్లు క్యాన్సిల్ చేయాలని ఇటీవల ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అధికారుల అసోసియేషన్ విన్నవించింది. అందరూ డిపార్ట్‌మెంట్‌కు వస్తే ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయొచ్చని మంత్రికి వివరించింది. ఆ ప్రతిపాదనను సీఎంకు మంత్రి వివరించగా.. సీఎం కూడా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. ప్రస్తుతం హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో కేవలం 60 మంది అధికారులు, ఉద్యోగులు మాత్రమే పనిచేస్తున్నారు. వీరితో పాటు మరికొంత మంది కాంట్రాక్ట్ పద్ధతిలో ప్రాజెక్టు మేనేజర్లుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్ట్ పద్ధతిలో సుమారు 600 మందిని రిక్రూట్ చేసుకోవాల్సి ఉంటుందని, ఇందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని హౌసింగ్ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.లి

**ప్రత్యేక శాఖగా హౌసింగ్** : హౌసింగ్‌ను ప్రత్యేక డిపార్ట్‌మెంట్‌గా మార్చాలని కొత్త ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వం హౌసింగ్ డిపార్ట్ మెంట్‌ను ఆర్ అండ్ బీలో విలీనం చేసింది. కేవలం విలీనం చేస్తున్నట్లు జీవో ఇచ్చి.. ఎలాంటి ప్రక్రియ చేపట్టలేదు. విలీనానికి ఎన్నో ఆస్తులు, అప్పులు, కోర్టు వివాదాలు అడ్డంకిగా ఉన్నాయని రిటైర్డ్ హౌసింగ్ అధికారులు చెప్తున్నారు. దీంతో ప్రభుత్వం కూడా ముందుకు వెళ్లలేదని అంటున్నారు.

**భారీగా అప్లికేషన్లు :** ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల స్కీమ్‌కు రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల అప్లికేషన్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. వీటిని క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. గ్రామాల్లో ఇండ్లు లేని వాళ్లు, సొంత జాగా ఉండి ఇండ్లు లేని వాళ్లు.. ఇలా అర్హులను సెలక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు, గృహలక్ష్మి స్కీమ్ కు అప్లై చేసుకున్న వాళ్లను పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

# పార్లమెంట్ పోరుకు ఉద్యోగుల సై

## వరంగల్, మానుకోట టికెట్లకు పోటాపోటీ..

### కాంగ్రెస్ టికెట్ల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు

### బీఆర్ఎస్ టికెట్‌పై గెలుస్తామన్న ధీమాతో ఒకరిద్దరు




వరంగల్ : పార్లమెంట్ ఎన్నికల వేళ సర్కారు కొలువును వదిలి రాజకీయ అరంగేట్రం చేసేందుకు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు సై అంటున్నారు. టికెట్ ఇస్తే చాలు తమ నౌకరీకి రాజీనామా చేసి ఖద్దరు దుస్తులు ధరించేందుకు రెడీ అవుతున్నారు. పార్టీ ఏదైనా సరే టికెట్ వస్తే బరిలో నిలుస్తామని కొందరంటుంటే... కాంగ్రెస్ టికెట్ వస్తే పక్కాగా పోటీ చేస్తామని కొందరు చెబుతున్నారు.

ఈ మేరకు తమ గాడ్‌ఫాదర్ల ద్వారా పార్టీల పెద్దలను కలిసేందుకు ఢిల్లీ, హైదరాబాద్‌కు పరుగులు పెడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్(ఎస్సీ), మహబూబాబాద్ (ఎస్టీ) స్థానాల్లో గత రెండు పర్యాయాలు బీఆర్ఎస్ విజయం సాధించింది. అయితే, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో టికెట్లు ఆశించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

**మహబూబాబాద్‌లో ఇలా..** మహబూబాబాద్‌లో అధికార కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తే విజయం తథ్యమనే ఆలోచనతో డజను మందికి పైగా ఆశావహులు అధిష్ఠానం చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. గతంలో మహబూబాబాద్ డీఎస్పీగా పని చేసిన ఖమ్మం జిల్లా వాసి దుంగ్రోత్ నాగరాజునాయక్ మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఏఐసీ(అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస)అడ్మిన్‌గా పని చేస్తున్నారు. టికెట్ వస్తే స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకోవాలని భావిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ భట్టు రమేష్ కూడా మహబూబాబాద్ నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎస్పీడీసీఎల్ డీఈగా పని చేస్తున్న మహబూబాబాద్ వాసి ఎట్టి వెంకన్న కూడా కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. ఇటీవలే ఆయన అనుచరులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రారెడ్డిని కలిసి వెంకన్నకు ఎంపీ టికెట్ ఇవ్వాలని, ఆదివాసీలకు అవకాశం ఇచ్చినట్లు అవుతుందని వివరించారు. మరికొందరు ఉద్యోగులు సైతం అంతర్గతంగా కాంగ్రెస్ టికెట్ కోసం తమకు తెలిసిన ముఖ్యనేతల ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు.. వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ కుమారుడు ఐఆర్ఎస్ జీవన్‌లాల్‌నాయక్ మహబూబాబాద్ నుంచి బీఆర్ఎస్ టికెట్ ఆశిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన మాలోతు భిక్షపతినాయక్ ఎప్పటి నుంచో ఎంపీ టికెట్ ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఎల్ఐసీ వరంగల్ డివిజన్ డీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు.

**వరంగల్ బరిలో నిలవాలని..** వరంగల్ లోక్‌సభ స్థానంలో పోటీకి సీనియర్ కాంగ్రెస్ నేతలకు దీటుగా ఉద్యోగులు సై అంటున్నారు. ఉమ్మడి వరంగల్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న హరికోట్ల రవి కాంగ్రెస్ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఆయనకు మంత్రి పొంగులేటితోపాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సత్సంబధాలున్నాయన్న చర్చ జరుగోతోంది. వీరి మద్దతుతో ఇటీవలే ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీని ఢిల్లీలో కలిశారు. గతంలో ప్రభుత్వ వైద్యుడిగా పని చేసిన రాగమళ్ల పరమేశ్వర్ కూడా కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. మాజీ పోలీస్ అధికారి దొమ్మాటి సాంబయ్య కూడా కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు.



## 'ధరణి' సమస్యలకు తహసీల్దార్ కార్యాలయాల్లోనే పరిష్కారం

' హైదరాబాద్: 'ధరణి' సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయాల్లోనే వీటిని పరిష్కరించాలని స్పష్టం చేశారు. ధరణి సమస్యల పరిష్కారం, కమిటీ గుర్తించిన అంశాలపై శనివారం సచివాలయంలో చర్చించారు. మార్చి మొదటి వారంలోగా 2.45 లక్షల పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలని రెవెన్యూ శాఖను ఆదేశించారు. దీనిపై విధివిధానాలు రూపొందించాలన్నారు. 2020 ఆర్‌వోఆర్ చట్టంలోనే లోపాలున్నాయని ధరణి కమిటీ తెలిపింది. "గత ప్రభుత్వం కేవలం 3 నెలల్లోనే సమగ్ర భూ సర్వే చేసింది. హడావుడిగా చేయడం వల్లే కొత్త చిక్కులు వచ్చాయి. పోర్టల్‌లో లోపాలు సవరించాలంటే చట్ట సవరణ లేదా కొత్త ఆర్‌వోఆర్ చట్టం చేయాలి. వివాదాలు లేకుండా భూరికార్డుల ప్రక్షాళన చేయాల్సి ఉంది" అని పేర్కొంది. కమిటీ తుది నివేదిక ఆధారంగా శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. వెంటనే పరిష్కరించాల్సిన సమస్యలపై దృష్టి పెట్టాలని సీఎం రేవంత్ ఆదేశాలు జారీ చేశారు.



# షెడ్యూల్‌కు సరిగ్గా వారం

## మార్చి 3న కేంద్ర క్యాబినెట్ భేటీ

# వరాలుంటాయా!?

2019 ఎన్నికలకు సంబంధించి ఆ ఏడాది మార్చి 10న షెడ్యూల్ వెలువడింది.. ఆపై నోటిఫికేషన్ వచ్చింది.. ఏప్రిల్ 10న తొలి దశ పోలింగ్ (ఏపీ అసెంబ్లీ, లోక్ సభ సీట్లు సహా దేశంలో కొన్ని సీట్లకు) జరిగింది. మే 23న దేశమంతటా ఫలితాలు వెలువడ్డాయి. ఈసారి కూడా మార్చి రెండోవారంలో షెడ్యూల్ వెలువడడం ఖాయం అనే కథనాలు వస్తున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం తమ ప్రయత్నాలు చేసోస్తోంది. అన్ని రాష్ట్రాల్లోనూ పర్యటించింది. వచ్చే ఎన్నికలకు సంబంధించి పూర్తిస్థాయి సన్నద్ధతను పరిశీలిస్తోంది. కానీ, వచ్చే ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ కు కొద్దిగా ముందు జాతీయ స్థాయిలో కీలక పరిణామం ఏమైనా జరగనుందా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. దీనంతటికీ ఓ కారణం ఉంది.

**సరిగ్గా వారం ముంగిట వరాలుంటాయా?...** లోక్ సభతో పాటు పలు రాష్ట్రాల్లోని అసెంబ్లీలకు ఎన్నికల షెడ్యూల్ కు సరిగ్గా వారం రోజుల ముందు కేంద్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. మార్చి 3న .. అంటే సరిగ్గా పది రోజుల్లో ఢిల్లీ చాణక్యపురిలోని సుష్మాస్వరాజ్ భవన్ లో కేంద్ర కేబినెట్ సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలో జరిగే ఈ భేటీలో ఏం జరగనుందో? ఏమైనా వరాలిస్తారా? అనే ప్రశ్నలు వస్తున్నాయి. వాస్తవానికి ఎన్నికల వాతావరణంలో మంత్రివర్గం సమావేశం కావడం చాలా తక్కువ. కానీ, ఈసారి దానికి భిన్నంగా జరుగనుంది. దీంతోనే ప్రాధాన్యం ఏర్పడింది.

**మార్చి 9 తర్వాత....** మోదీ తొలిసారి ప్రధాని అయిన ఎన్నికలు 2014లో జరిగాయి. వాటిని తొమ్మిది విడతల్లో జరిపారు. అప్పుడు మార్చి 5న ప్రక్రియ మొదలై మే 16న ఫలితాలు వచ్చాయి. అయితే, 2019లో మార్చి 10న షెడ్యూల్ వచ్చింది. మొత్తం ఏడు విడతల్లో పోలింగ్ సాగింది. ఇప్పుడు 2024 ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ మార్చి 9 తర్వాత ప్రకటించే అవకాశం ఉంటుంది. గత షెడ్యూల్ వచ్చి అప్పటికి సరిగ్గా ఐదేళ్లు అవుతుంది. కాగా, ఈసారి లోక్ సభతో పాటు ఏపీ, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం శాసనసభలకు మేలోగా ఎన్నికలు జరగాల్సి ఉంది. క్రితం సారి ఈ జాబితాలో లేనిది జమ్మూకశ్మీర్. 2019ల ఎన్నికల అనంతరం మూడు నెలలకు కశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి ఇచ్చే ఆర్టికల్ 370ని రద్దు చేశారు. జమ్మూకశ్మీర్ ను కశ్మీర్, లద్దాఖ్ గా విభజించారు. అప్పటినుంచి కేంద్ర పాలిత ప్రాంతంగానే ఉంది. అక్కడి అసెంబ్లీకి లోక్ సభతో పాటు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం భావిస్తోంది.

**ఏమైనా తీర్మానాలుంటాయా?....** మార్చి 3న జరిగే కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఏమైనా ప్రత్యేక తీర్మానాలుంటాయా? అనేది చూడాలి. మోదీ మరోసారి గెలిచి హ్యాట్రిక్ కొడతామని అంటున్న నేపథ్యమే ఈ ఊహాగానాలకు బలం ఇస్తోంది. మరోవైపు 370 సీట్లను టార్గెట్ గా పెట్టుకున్నందున మోదీ రెండో మంత్రివర్గ చివరి సమావేశం ద్వారా ఏం చెబుతారనేది ఆసక్తిగానూ మారింది. గత పదేళ్ల పాలన.. మరీ ముఖ్యంగా ఐదేళ్లుగా మోదీ పెద్దగా ప్రజాకర్షక విధానాలు ప్రకటించలేదు. వాటిని భర్తీ చేస్తూ దేశ ప్రజలకు ఏమైనా ఊరడింపులు ఇస్తారేమో చూడాలి.

## సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

# అంతమంది మహిళలు ఉద్యోగాలను వదిలేస్తున్నారా?

గతకొంతకాలంగా ఉద్యోగాలు చేస్తున్న మహిళల సంఖ్య విపరీతంగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో రకరకాల కారణాలతో వారిలో ఎక్కువ మంది చేస్తున్న ఉద్యోగాలను వదిలేస్తున్నారని అంటున్నారు. ఇందులో భాగంగా... ఉద్యోగాలు చేస్తున్న మహిళల్లో సుమారు 34శాతం మంది ఉద్యోగాలను వదిలేస్తున్నారని తాజాగా నిర్వహించిన ఓ అధ్యయనంలో తేలింది! ఈ విషయంలో మగవారి సంఖ్య చాలా తక్కువగానే ఉంది! అవును... వ్యక్తిగత జీవితం, వృత్తిపరమైన బాధ్యతల్ని సమతుల్యం చేసుకోలేక సుమారు 34 శాతం మంది మహిళలు తమ ఉద్యోగాలను వదిలేస్తున్నారని తాజాగా ఒక అధ్యయనంలో తేలింది. ఈ విషయంలో మగవారి సంఖ్య కేవలం 4% మాత్రమే ఉండటం గమనార్హం. మహిళలు ఈ స్థాయిలో ఉద్యోగాలు వదిలిపెట్టడానికి పైన చెప్పుకున్నట్లు వ్యక్తిగత, వృత్తిపరమైన బాధ్యతల్ని సమతుల్యం చేసుకోలేకపోవడం మాత్రమే ఇందుకు కారణం కాదని తెలుస్తుంది. ఇందులో భాగంగా... మహిళల వైవాహిక స్థితి, వయసు, నివాస ప్రాంతాలను కూడా హెచ్.ఆర్. మేనేజర్లు పరిగణలోకి తీసుకోకపోవడం కూడా మహిళలు భారీ సంఖ్యలో ఉద్యోగాలను వదిలేయడానికి గల ఇతర కారణాలుగా చెబుతున్నారు. ఈ విధంగా కుటుంబ బాధ్యతల వలన ఉద్యోగాలు వదిలేస్తున్నవారిలో ఎక్కువమంది 30 – 35 సంవత్సరాల మధ్య వయసు వారే అని అంటున్నారు. తాజా వివరాలను బట్టి చూస్తే... 30 – 35 సంవత్సరాల సమయంలో మహిళలు ఉద్యోగాలు వదిలేయడానికి పిల్లల సంరక్షణ కూడా ఒక కారణం అని తెలుస్తుంది. ఇదే సమయంలో మహిళలు ఇంటి బాధ్యతల విషయంలో ఎంత కీలకంగా ఉంటారనేది తెలిసిన సంగతే! జాతీయ గణాంకాల కార్యాలయం చెబుతున్న వివరాల ప్రకారం... మహిళలు ఇంటి పనులకోసం రోజుకి ఏడు గంటలకు మించి సమయం వెచ్చిస్తున్నారట! ఇదే సమయంలో ఒకసారి జాబ్ వదిలేసిన తర్వాత.. తిరిగి జాయిన్ అయ్యే విషయంలో కూడా మహిళలకు అవకాశాలు తక్కువగా ఉంటున్నాయని మరొక సర్వేలో తేలిందని తెలుస్తుంది. తిరిగి జాబ్ లో చేరడానికి తమ ఉద్యోగ పరమైన స్కిల్స్ ని పెంచుకోవాల్సి రావటంతోపాటు.. వారు మానేసిన సమయంలో జరిగిన సాంకేతిక అభివృద్ధిని అర్థం చేసుకోవాల్సిన అవసరం వంటివి వారు తిరిగి ఉద్యోగాల్లో చేరకుండా అడ్డుకుంటున్నాయని అంటున్నారు. ఇటువంటి సమస్యలతో ఉద్యోగాలు వదిలేసినవారిలో సుమారు 70శాతం మంది మహిళలు ఈ విధంగా బాధపడుతున్నారని తెలుస్తుంది.

# పట్టుబడుతున్నా.. ఆగని దందా!



హుజూరాబాద్ : గత నెల 21న హుజూరాబాద్‌లోని ఓ రైస్‌మిల్లులో 120 క్వింటాళ్ల రేషన్ బియ్యం పోలీసులు పట్టుకుని నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నెల 6న రాత్రి మానకొండూరులో 304.80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నలుగురిపై కేసు నమోదు చేశారు. ఇదే రోజు వీణవంక మండలం చల్లూరులో అక్రమంగా తరలిస్తున్న 40 క్వింటాళ్ల బియ్యం పట్టుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. హుజూరాబాద్‌కు ఓ మిల్లరు 98 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా కమలాపూర్ పోలీసులు పట్టుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈ నెల 8న హుజూరాబాద్ మండలం కందుగులలోని ఓ రైస్‌మిల్లులో 40 క్వింటాళ్లు పట్టుకుని మిల్లు యజమానిపై కేసు నమోదు చేశారు. ఇదే రోజు వీణవంక మండలం గంగారంలో 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు.

ఈ నెల 10న హుజూరాబాద్ మండలం రాజపల్లి వద్ద ఆటో ట్రాలీలో తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పోలీసులు పట్టుకుని ఆరుగురిపై కేసులు నమోదు చేశారు.

ఈ నెల 14న సుల్తానాబాద్ మండలంలో రేషన్ దుకాణాల నుంచి మిల్లులకు తరలిస్తున్న 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్న పోలీసులు.రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. క్షేత్రస్థాయిలో నిఘా పెట్టి బియ్యం రవాణాను అరికట్టాలని, అక్రమార్కులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. దీంతో నెల రోజులుగా టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు వేర్వేరుగా తనిఖీలు నిర్వహించి భారీ మొత్తంలో రేషన్ బియ్యం పట్టుకున్నారు. అనేకచోట్ల పట్టుబడుతున్నా.. బియ్యం అక్రమ దందా మాత్రం ఆగడం లేదు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఎన్ని సంస్కరణలు తెచ్చినా.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినా ఫలితం లేకుండాపోతోంది. అంతా కుమ్మక్కై పక్కదారి పట్టిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సరైన నిఘా లేకపోవడం, స్థానిక అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలున్నాయి.

లబ్ధిదారుల నుంచే కొనుగోలుఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో 2,77,999, జగిత్యాలలో 3,07,168, పెద్దపల్లిలో 2,19,684, రాజన్న సిరిసిల్లలో 1,73,768 ఆహార భద్రత కార్డులు ఉన్నాయి. మొత్తంగా 26,66,469 యూనిట్లకు (లబ్ధిదారులు)గానూ 17,973.234 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రతి నెలా పంపిణీ అవుతోంది. ఇందులో 70 శాతం బియ్యం పక్కదారి పడుతున్నట్లు అంచనా. అంటే 11 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పట్టణాలు, గ్రామాల్లో దళారులను పెట్టుకొని తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ ఈ దందా సాగిస్తున్నారు. చౌక బియ్యం ఉపయోగించని లబ్ధిదారులను వ్యాపారులు గుర్తించి వారి ఇళ్ల వద్దకు ద్విచక్ర వాహనాలు,

ఆటో ట్రాలీలపై వెళ్లి రేషన్ బియ్యాన్ని కిలో రూ.10 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఆ బియ్యాన్ని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి ఒకేసారి పెద్ద మొత్తంలో బడా వ్యాపారులకు కిలో రూ.20 నుంచి రూ.25 చొప్పున విక్రయిస్తున్నారు. కొన్ని చోట్ల డీలర్లే బియ్యానికి బదులుగా కిలో రూ.14 చొప్పున నగదు చెల్లించి లబ్ధిదారుల నుంచి తీసుకుంటున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై గత నెల రోజుల్లో పలువురు డీలర్లపై కేసులు కూడా నమోద య్యాయి. ఇలా సేకరించిన బియ్యాన్ని అక్రమార్కులు మిల్లుల్లో పాలిష్ చేయించి వాటిని సన్నరకం బియ్యంలో కలుపుతుండగా, మరికొందరు సీఎంఆర్‌కు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని అమ్ముకున్న మిల్లర్లు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి రీ సైక్లింగ్ చేస్తున్నారు. సర్కారు బియ్యాన్ని సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికే అప్పగిస్తున్నారు. ఈ మేరకు గత నెల 21న హుజూరాబాద్‌లోని ఓ రైస్‌మిల్లులో 120 క్వింటాళ్లు, ఈ నెల 8న కందుగులలోని మరో రైస్‌మిల్లులో 40 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. హుజూరాబాద్ సబ్ డివిజన్‌లో నెల రోజుల వ్యవధిలోనే 500ల క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడగా, 18 మందిపై కేసులు నమోదయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం తనిఖీలు నిర్వహించి లారీల కొద్దీ బియ్యాన్ని పట్టుకుంటుండగా స్థానిక పౌరసరఫరాల శాఖ అధికారులు ఏమి చేస్తున్నారనేది అంతుపట్టకుండా ఉంది.

# పనులు పక్కానా... నిధులు దక్కేనా?



కరీంనగర్ : కరీంనగర్ పర్యాటక ప్రగతికి తలమానికం అని పేర్కొంటూ గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన 'మానేరు రివర్ ఫ్రంట్' ఎప్పుడు పూర్తయ్యేను అన్న చర్చ నడుస్తోంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ఈ ప్రాజెక్టు నిధుల వ్యయంపై ఫిర్యాదులు వెళ్లడంతో విచారణకు ఆదేశించగా పనులు ప్రస్తుతం ఆగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి గంగుల కమలాకర్ ప్రాజెక్టును మంజూరు చేయించారు. గతేడాదిలోనే పనులు పూర్తయ్యే విధంగా కార్యాచరణ రూపొందించినా.. నిర్ణీత సమయానికి పూర్తవ్వలేదు. మానేరు రివర్ ఫ్రంట్‌కు అనుబంధంగా నిర్మించిన తీగల వంతెనను మాత్రం గతేడాది ప్రారంభించారు. శాసనసభ ఎన్నికలు ముగిసి కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక ఖర్చయిన నిధులకు.. వాస్తవ్మగా జరిగిన పనులకు పొంతన లేదని కొందరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఇంజినీరింగ్ అధికారులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే స్థానిక ఎమ్మెల్యే కమలాకర్ శాసనసభలో శుక్రవారం మాట్లాడుతూ 70 శాతం పనులు పూర్తయ్యాయని.. నిధులు మంజూరు చేసి మరో 30 శాతం పనులు పూర్తి చేస్తే పర్యాటకంగా అభివృద్ధి చెంది ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మానేరు రివర్ ఫ్రంట్ మంచి అభివృద్ధి కార్యక్రమమే అయినా పనులపై ఫిర్యాదులు రావడంతో విచారణ జరుగుతోందని చెప్పారు. ఎలాంటి తప్పిదాలు లేవని తేలితే.. కచ్చితంగా పనులు కొనసాగిస్తామని పేర్కొన్నారు. దీంతో స్థానికంగా పనుల పురోగతిపై.. ఆరోపణలపై చర్చ జరుగుతోంది.

ప్రాజెక్టు పనుల క్రమం ఇదీ..

మానేరు రివర్ ఫ్రంట్ పనులకు 2022లో అప్పటి ప్రభుత్వం రూ.538 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. నదికి ఇరువైపులా కట్ట నిర్మాణంతోపాటు బోటింగ్, ఫుడ్ కోర్టులు, బృందావనాలను నిర్మించాలనుకున్నారు. ఆర్అండ్‌బీ, నీటిపారుదల, పర్యాటక శాఖల సమన్వయంతో ఇక్కడి పనుల పర్యవేక్షణ సాగింది.

మొదటి దశలో 2.06 కి.మీ.ల వరకు ప్రహరీ నిర్మించడానికి 2022 ఏప్రిల్‌లో టెండర్లు పిలిచారు. జూన్‌లో ఎల్ఎండీ గేట్‌ల వద్ద నుంచి తీగల వంతెన వరకు నదికి ఇరువైపులా బలమైన కట్ట నిర్మాణ పనుల్ని ప్రారంభించారు. దాదాపుగా 3.07 కి.మీ.ల మేర నీళ్లు నిలిపి, మధ్యలో పెద్ద ఫౌంటెయిన్‌ను ఏర్పాటు చేసి.. ఇరువైపులా పర్యాటకుల సందర్శనకు వీలుగా ఆహ్లాదకరమైన వసతుల్ని కల్పించాలనుకున్నారు. వర్షాలు పడటంతో జులైలో పనులు ఆపారు. మళ్లీ అదే సంవత్సరం 2022 నవంబరులో పనులు మొదలుపెట్టి గతేడాది జులై వరకు మట్టి నింపడంతోపాటు ఇతర నిర్మాణాలు చేపట్టారు. నిధులను విడతల వారీగా విడుదల చేశారు.రెండో దశలో ఇరువైపులా మిగతా 1.01 కి.మీ.ల కట్ట పనులతోపాటు పర్యాటకంగా అవసరమైనవి చేపట్టాలి. ఇందుకోసం రూ.230 కోట్లు అవసరం. ఈ నిధులు వస్తేనే మిగతా పనులు జరుగుతాయి. విచారణ పూర్తయితే కాని మిగిలిన పనులకు నిధుల కేటాయింపుపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

# ఆహ్లాదం దిశగా అడుగులు

కరీంనగర్ : కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ పరిధిలో మరో పార్కు ముస్తాబవుతోంది. గత నాలుగేళ్లుగా నత్తనడకన సాగిన పనులు కొలిక్కి వస్తున్నాయి. రూ.7.50 కోట్లతో నగర నడిబొడ్డున ముకరంపురలో ఆహ్లాద వాతావరణం కల్పించేందుకు నగర పాలిక చర్యలు తీసుకుంది. చిన్న పిల్లల నుంచి మొదలుకొని వృద్ధుల వరకు ఉద్యానవనాన్ని వినియోగించునేలా తీర్చిదిద్దుతున్నారు. పనులన్నీ పూర్తయి అందుబాటులోకి రావడానికి రెండు నెలల సమయం పట్టనుంది.

హంపీ థియేటర్ కూడా..ఉదయం, సాయంత్రం పూట నగరవాసులు వాకింగ్ చేసేందుకు వీలుగా ఈపీడీఎం ఫ్లోరింగ్ నిర్మించారు. 15 మి.మీ మందంతో 700 మీటర్ల పొడవునా దీనిని నిర్మించగా సర్కస్ గ్రౌండ్ కంటే రెట్టింపు ఉంటుంది. ప్రస్తుతం ఇదొక్కటే అనువుగా ఉండగా కొద్ది రోజుల్లో దీనిని కూడా ఉపయోగించుకునే అవకాశముంటుంది. ఈ పార్కులో హంపీ థియేటర్ నిర్మించారు. సుమారు 300 మంది కూర్చోనేలా ఏర్పాట్లు చేయగా చిన్నపాటి సమావేశాలకు వేదికగా కానుంది. పూర్తి స్థాయిలో నిర్మాణ పనులు చేయగా కలరింగ్ చేయాల్సి ఉంది.

వైవిధ్య ఆటపరికరాలు..సెలవు రోజుల్లో, సాయంత్రం పూట వచ్చే పిల్లల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా స్ప్రింగ్ బైక్, క్యామెల్, నన్ బంఫ్ సీసా, క్రౌల్ ట్యూబ్, మినీ మ్యాట్రిక్స్, రోటో స్లైడ్, సీటర్ ఏరియా స్వింగ్, వాకింగ్ బ్యారెడ్, కప్ప, పీక్ క్లైంబర్, మల్టీఫుల్ ఆట పరికరాలు, టెర్రీగో వంటివి బిగించారు. ఆడుకునే సమయంలో చిన్నారులు పడిపోతే దెబ్బతగలకుండా ఈపీడీఎం ఫ్లోరింగ్ చేస్తున్నారు. రబ్బరులాగా ఉండేందుకు 36 మి.మీ మందంతో నిర్మిస్తున్నారు. హైదరాబాద్ దుర్గం చెరువులో ఉన్నట్లుగా మ్యూజికల్ ఫౌంటెయిన్ ఉండనుంది. ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయి. రాత్రిపూట మ్యూజిక్‌తో అనుసంధానంగా నీరు వచ్చి ఆకట్టుకునేలా ఉంటుంది. అదేవిధంగా ఫిష్ పాండ్ నిర్మించగా బయో ఫిల్టర్లు, మోటార్లు బిగించనున్నారు.

# పరిశ్రమలు తరలొచ్చె.. ఉపాధి కల్పించె

చౌటుప్పల్ : యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం రెవెన్యూ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ పారిశ్రామికవేత్తల సమాఖ్య(టిఫ్) సంయుక్తంగా నిర్మించిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) పార్కు లక్ష్యానికి చేరుకుంటోంది. 2019 నవంబరు 1న ఈ పార్కును ప్రారంభించారు. 542 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే ఈ పారిశ్రామిక పార్కులో మొత్తం 510 పరిశ్రమలను విడతల వారీగా నెలకొల్పనున్నారు. మొదటి విడతలో 377 ఎకరాల స్థలాన్ని తెలంగాణ మౌలిక సదుపాయాల సంస్థ(టీఎస్ఐఐసీ) సేకరించి తెలంగాణ పరిశ్రమల సమాఖ్య(టిఫ్)కు అప్పగించింది. మొదటి విడతలో సేకరించిన స్థలంలో 350 పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే దాదాపు 110 పరిశ్రమలు ఉత్పత్తులను ప్రారంభించాయి. మరో 130 పరిశ్రమలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. నెల, రెండు నెలల్లో కొన్ని పరిశ్రమలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. యంత్రాల బిగింపు తుదిదశకు చేరకున్నాయి. ఇంకా 10 మంది పారిశ్రామిక వేత్తలు స్థలాలను పొంది నిర్మాణాలను ప్రారంభించలేదు. దీంతో టిఫ్ ప్రతినిధులు వారికి నోటీసులను జారీ చేశారు. నిర్మాణాలను ప్రారంభించకపోతే స్థలాలను రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఉత్పత్తులను ప్రారంభించిన పరిశ్రమల్లో, నిర్మాణాలు ఉన్న పరిశ్రమల్లో కలిపి సుమారు ఐదు వేల మంది వరకు కార్మికులు



ఉపాధిని పొందుతున్నారు. ఎక్కువగా ఫుడ్ ప్రాసెసింగ్, ఇంజినీరింగ్, ప్రింటింగ్, ప్యాకింగ్, ఫార్ములేషన్, టైల్స్, వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేసే బ్రికెట్స్, కాలుష్య రహిత పరిశ్రమలు ఉన్నాయి.


రూ.కోట్లలో పెట్టుబడులు..దేశంలోనే తొలిసారిగా రాజధానికి సమీపంలో నిర్మించిన ఎంఎస్ఎం ఈ పార్కు కావడంతో పారిశ్రామిక వేత్తల నుంచి అనూహ్య స్పందన లభించింది. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారికి ఆనుకొని, ఔటర్ రింగు రోడ్డుకు సమీపంలో పార్కు ఉండటంతో తమకు స్థలాలు కావాలని అధికంగా విన్నపాలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం స్పందించి రెండు, మూడు విడతల్లో కలిపి మరో 165 ఎకరాల భూమిని సేకరించింది. ఈ భూమిని 160 మంది పారిశ్రామిక వేత్తలకు పంపిణీ చేశారు. స్థలాలు పొందిన వారు పరిశ్రమల నిర్మాణాలకు అనుమతు లను తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. పారిశ్రామిక వేత్తలు రెండేళ్లలోపు పూర్తి చేయాలనే నిబంధనను పెట్టినట్టు టిఫ్ ప్రధాన కార్యదర్శి మిర్యాల గోపాల్‌రావుతో తెలిపారు. మొత్తం పార్కు నిర్మాణం పూర్తి జరిగితే సుమారు రూ.రెండు వేల కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మంది కార్మికులకు ఉపాధి లభించనుంది.

# ఒక్కో అడుగు.. డీసీసీబీ పీఠం వైపు..!

ఖమ్మం : ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పీఠం కైవసం చేసుకునేందుకు అధికార పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. తగిన సంఖ్యాబలం లేకపోయినప్పటికీ ప్రధాన పదవిని చేజిక్కించుకునేందుకు పావులు కదిపింది. మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్యపై కాంగ్రెస్ నాయకులు డీసీసీబీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతారని భావించినా తగిన బలం లేకపోవటంతో వి.వెంకటాయపాలెం సహకార సంఘంలో సంపూర్ణంగా ఉన్న మద్దతు ద్వారా అతడిని పదవీచ్యుతుడిని చేయగలిగారు. కూరాకుల ఛైర్మన్ పదవి కోల్పోవటంతో బ్యాంకు వైస్‌ఛైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావుకు ఇన్‌ఛార్జి ఛైర్మన్ బాధ్యతలు దక్కాయి.

వ్యూహాత్మకంగా వ్యవహరించిన కాంగ్రెస్

రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగాక పరిస్థితులను తమకు అనుకూలంగా మలచుకునేందుకు కాంగ్రెస్ యత్నించింది. ఇప్పటికీ భారాసకు సంబంధించిన పాలకవర్గ సభ్యులే అధికంగా ఉన్నారు. వీరి సంఖ్య తగ్గించేందుకు కాంగ్రెస్ వ్యూహాలు రచిస్తోంది. డీసీసీబీ డైరెక్టర్, చేగొమ్మ పీఏసీఎస్ అధ్యక్షుడు ఇంటూరి శేఖర్‌రావుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు పావులు కదుపుతోంది. తీర్మానం నెగ్గితే శేఖర్‌రావు సంఘం అధ్యక్షుడితో పాటు డీసీసీబీ డైరెక్టర్ పదవులు కోల్పోవాల్సి వస్తుంది. అయినప్పటికీ మరికొందరు డీసీసీబీ డైరెక్టర్లు కాంగ్రెస్‌లో చేరితేనే ఆపార్టీ నాయకుడికి ఛైర్మన్ పదవి దక్కే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఇన్‌ఛార్జి ఛైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావు స్థానంలో కొత్త ఛైర్మన్‌ను ఎన్నుకోవాలి. పదవీకాలం ఏడాది మాత్రమే మిగిలి ఉండటంతో తననే ఈపదవిలో కొనసాగించాలని వెంకటేశ్వరరావు కోరుతున్నట్లు సమాచారం. ఛైర్మన్ ఎన్నికకు త్వరలోనే జిల్లా సహకార



అధికారులు నోటిఫికేషన్ జారీ చేస్తారు. కూరాకులపై అవిశ్వాస తీర్మానం పెట్టినప్పటి నుంచి పలువురు డీసీసీబీ డైరెక్టర్లు.. ఛైర్మన్ పదవి కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఛైర్మన్ పదవిని ఆశించే వారిలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరులు ఉన్నారు.

డీసీఎంఎస్, సహకార సంఘాలపైనా కన్ను

డీసీసీబీ ఛైర్మన్ పదవే కాకుండా డీసీఎంఎస్ ఛైర్మన్‌తో పాటు ఉభయ జిల్లాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సైతం తమ ఆధిపత్యం చెలాయించాలని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. ఇప్పటికే వీవీపాలెం పీఏసీఎస్ ఛైర్మన్ పదవిని కూరాకుల నాగభూషయ్య కోల్పోయారు. అక్కడ ప్రస్తుతం ఉపాధ్యక్షుడిగా ఉన్న రావెళ్ల శ్రీనివాసరావుకు తాత్కాలిక అధ్యక్ష బాధ్యతలు దక్కాయి. ఈనెల 20న అధ్యక్షుడి ఎన్నిక నిర్వహించేందుకు జిల్లా సహకారశాఖ ప్రకటన వెలువరించింది. కామేపల్లి, చేగొమ్మ సహకార సంఘాల అధ్యక్షులు, సత్తుపల్లి మండలం కిష్టారం సంఘం ఉపాధ్యక్షుడిపై అవిశ్వాస తీర్మానాలు పెట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని దమ్మపేటలోనూ అవిశ్వాస తీర్మానం పెట్టిన విషయం తెలిసిందే.

## ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే : అనీల్ జాదవ్



**గుడిహత్నూర్ ఫిబ్రవరి 24 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం బోథ్ ఎమ్మెల్యే అనీల్ జాదవ్ సందర్శించారు.. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న రోగులను కలిసి సిబ్బంది వైద్య సేవలపై ఆరా తీశారు. అరోగ్యకేంద్రానికి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్యధికారి డాక్టర్ శ్యామ్ ను అదేశించారు అదేవిదంగా మండల కేంద్రంలోని మహంకాళి ఆలయం ప్రహరీ గోడ, రవీంద్ర నగర్ లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాదవ్ సునీత, తిరుమల్ గౌడ్, అడే శిలా, రమేష్ జాదవ్, సంజీవ్ ముండే, తదితరులు పాల్గొన్నారు

## మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదు ఎస్సై రామ్మోహన్




**గంభీరావుపేట ఫిబ్రవరి 24(ప్రభాత సమాచారం)**
మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని గంభీరావుపేట ఎస్సై రామ్మోహన్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వాహన దారుల వద్ద వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని అన్నారు.మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల దేశంలో సుమారు 50 వేల మంది కుటుంబాలు రోడ్డున పడుతున్నారని తెలిపారు 18 ఏళ్లు పైబడి డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలని తెలిపారు మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు లేదా వాహన యజమాని పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.ఈ మధ్యకాలంలో చాలామంది యువత డ్రగ్స్ మాయలో పడుతున్నారని ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే శిక్ష శిక్షింపబడతారని హెచ్చరించారు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు అనుమానంగా కనిపిస్తే వారిని పట్టుకుని పోలీస్ స్టేషన్ కి తెలుపాలని సూచించారు.

## బీజేపీ విజయ సంకల్ప బస్ యాత్రను విజయవంతం చేయండి




**గంభీరావుపేట ఫిబ్రవరి 24(ప్రభాత సమాచారం)**
భారతీయ జనతా పార్టీ గంభీరావుపేట మండల శాఖఆధ్వర్యంలో మండల బూత్ స్థాయి అధ్యక్షుల తో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ పార్లమెంట్ కో కన్వీనర్ ఆడేపు రవీందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 2 తేదీన జరిగే విజయ సంకల్ప బస్ యాత్రను విజయవంతం చేయవలసిందిగా కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, జిల్లా మైనారిటీ అధ్యక్షులు వాజిద్ హుస్సేన్,మండల ప్రధాన కార్యదర్శి దోమకొండ కృష్ణకాంత్ యాదవ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు కోడె రమేష్,మండల ఉపాధ్యక్షులు దుంపటి యెల్లందర్ యువమోర్చా అధ్యక్షులు నామాపురం విగ్నేష్ గౌడ్, సీనియర్ నాయకులు లక్కిరెడ్డి రాజిరెడ్డి, సర్వోత్తం,లక్ష్మీపురం రాజుగౌడ్, గుర్రం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల 'ఢిల్లీ చలో' మార్చ్ వాయిదా.. నెక్స్ట్ ఎప్పుడంటే

కనీస మద్దతు ధర సహా పలు డిమాండ్ల కోసం ఆందోళన చేస్తున్న రైతుల 'ఢిల్లీ చలో' పాదయాత్రకు ప్రస్తుతానికి విరామం ప్రకటించారు. ఈ క్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా 'ఢిల్లీ చలో మార్చ్' ఫిబ్రవరి 29కి వాయిదా వేసింది. దీంతో గత రెండు రోజులుగా రైతుల ఆందోళనకు బ్రేక్ పడింది. 'ఢిల్లీ చలో' మార్చ్‌ను ఫిబ్రవరి 29వ తేదీకి వాయిదా వేసినట్లు ఖానోరీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైతు నాయకుడు సర్వన్‌సింగ్ పంధేర్ తెలిపారు. తదుపరి వ్యూహంపై 29న నిర్ణయం తీసుకుంటామన్నారు. ఫిబ్రవరి 24న 'క్యాండిల్ మార్చ్' చేపడతామని, ఫిబ్రవరి 26న కేంద్రం దిష్టిబొమ్మను దహనం చేస్తామని ప్రకటించారు. యునైటెడ్ కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా ఈ నిర్ణయం తీసుకున్నాయి.

## కొత్త గ్రామపంచాయతీ ఏర్పాటు పై ప్రజాభిప్రాయ సేకరణ



**తాండూర్, ఫిబ్రవరి24(ప్రభాత సమాచారం)**
తాండూర్ గ్రామపంచాయతీలో శనివారం ఐబి కొత్త గ్రామపంచాయతీ ఏర్పాటుపై తాండూర్ గ్రామ ప్రజల అభిప్రాయ సేకరణ గ్రామసభ నిర్వహించారు. తాండూర్ గ్రామ ప్రత్యేక అధికారి తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సభ నిర్వహించారు. మొదట ఐబి ప్రాంతానికి చెందిన నాయకులు, యువకులు ప్రజలు గ్రామపంచాయతీ గ్రామసభ వేదికకు చేరుకొని తమకు ఐబి గ్రామపంచాయతీ కావాలంటూ స్పెషల్ ఆఫీసర్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం తాండూర్ గ్రామానికి చెందిన ప్రజలు, యువకులు పలు వార్డుల నుండి గ్రామపంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకొని తమకు తాండూర్ మున్సిపాలిటీ కావాలంటూ ఎంపీడీవో తాండూర్ స్పెషల్ ఆఫీసర్‌కు వినతి పత్రాలు అందజేశారు. అభిప్రాయ గ్రామ సభలో మొత్తము 28 దరఖాస్తులు రాగా 27 దరఖాస్తులు మునిసిపాలిటీ కావాలంటూ, ఒకటి ఐబి గ్రామపంచాయతీ కావాలంటూ దరఖాస్తు వచ్చాయని స్పెషల్ ఆఫీసర్ తెలిపారు. పై అధికారుల సూచన మేరకు ఐబి గ్రామపంచాయతీ కావాలంటూ దరఖాస్తులు పెట్టుకున్నందువలన తాండూరు గ్రామపంచాయతీ ప్రజల అభిప్రాయ సేకరణకై మాత్రమే ఈ గ్రామసభ నిర్వహించడం జరుగుతుందని గ్రామసభలో వచ్చిన అభిప్రాయ సేకరణ వినతి పత్రాలు ప్రజా అభిప్రాయ సేకరణ సంతకాలను తో కూడిన పత్రాలను పై అధికారులకు నివేదికలు అందజేస్తామన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు పాటు పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీటీసీ సిరంగి శంకర్,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి ఈసా, ఎంపీ ఓ సత్యనారాయణ ,తాండూర్ పంచాయతీ కార్యదర్శి తపాస్ కుమార్, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్ద బోయిన శంకర్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాబీర్ హుస్సేన్, ఐబి యువకులు, తాండూర్ గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**











**ఉట్నూర్ ఫిబ్రవరి 24(ప్రభాత సమాచారం)**
ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు.శనివారం ఉట్నూర్ మండలంలోని పాతఉట్నూర్,ఎక్స్ రోడ్,చందూరి గ్రామాల్లో హిరాసుక జయంతి ఉత్సవాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు.ముందుగా సంప్రదాయ బద్దంగా పూజలు నిర్వహించి, హిరాసుక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడారు. ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను ఆచారాలను కాపాడుతూనే, భావితరాలకు అందించాలన్నారు. పాహండి కుపర్ లింగో, జంగుబాయి, హిరాసుక,ఆదివాసీ దేవతలను పూజించాలన్నారు.వారు చూపిన మార్గన్ని అనుసరించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు.ఉట్నూర్ మండల కేంద్రంలోని హిరాసుక భవన అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.చాందూరి గ్రామంలో బిటి రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు.ఆదివాసీలు గిరిజనేతరులతో కలసి మెలసి ఉండాలి సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన్ సంఘం పెద్దలు,ఉద్యోగులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట పడేనా?



తంగళ్లపల్లి: నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా వేస్తున్న లేఅవుట్లపై అధికారుల నిఘా కరవైంది. సిరిసిల్ల పట్టణం, తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాలైన సారంపల్లి, నేరెల్ల, మండెపల్లి, బద్దెనపల్లి, పద్మనగర్, తాడూరు, లక్ష్మీపూర్, అంకుసాపూర్, చీర్లవంచ తదితర గ్రామాల్లో పుట్టగొడుగుల్లా అక్రమ వెంచర్లు వెలిశాయి. ప్రభుత్వ అనుమతి లేకుండానే క్రయ, విక్రయాలు కొనసాగుతున్నాయి. మండలంలో గతంలో లోటస్ వెంచర్‌కు ఇచ్చిన అనుమతులు తప్ప ఇప్పటి వరకు ఉన్న 132 వెంచర్లలో పూర్తిస్థాయిలో ఏ ఒక్కదానికీ అనుమతి లేదు. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

తంగళ్లపల్లి మండలంలో పద్మనగర్ 1, జిల్లెల్ల 2, నేరెల్ల 2 మొత్తం 5 వెంచర్లకు పూర్తిస్థాయిలో అనుమతి రాకుండానే క్రయ, విక్రయాలు చేస్తున్నారు. అలాగే తంగళ్లపల్లి మండల కేంద్రంతోపాటు బద్దెనపల్లి, మండెపల్లి, సారంపల్లి గ్రామాల్లో స్థిరాస్తి వ్యాపారులు శ్రీగంధం చెట్ల పెంపకం పేరిట ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వెంచర్లు వేస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే పంచాయతీరాజ్‌శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వారికి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకొంటున్నారు. ఇది ఒక్క తంగళ్లపల్లి మండలంలోనే కాదు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పట్టణం నలుమూలల విస్తరించి ఉన్నాయి. తంగళ్లపల్లి మండలంలో మొత్తం 132 వెంచర్లు ఉండగా అందులో మండల కేంద్రంలో సగానికి పైగా ఉండటం విశేషం.

నిబంధనలు బేఖాతరు

ఒక ఎకరం స్థలంలో లే అవుట్ ఏర్పాటు చేయాలంటే 40 అడుగుల రహదారి, 30 అడుగుల అంతర్గత రహదారి, 10 శాతం పంచాయతీ పేరిట రిజర్వ్ స్థలం, పూర్తిస్థాయిలో అనుమతులు వచ్చే వరకు మరో 15 శాతం భూమి గ్రామ పంచాయతీ ఆధీనంలో ఉండేలా కేటాయించాల్సి ఉంటుంది. లేఅవుట్ రుసుం, మార్పిడి, కాలువలు, వీధి దీపాలు, అంతర్గత పైపులైన్లు, రహదారుల అభివృద్ధితో పాటు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఒక వెంచర్‌లో ఇవన్నీ ఉంటేనే ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతి ఇవ్వాలి. ఇవేవీ పట్టించుకోకుండా తాత్కాలిక అనుమతుల కోసం రుసుం చెల్లించి ఆ పత్రాలతో అనుమతులు ఉన్నాయంటూ నిర్వాహకులు ప్లాట్లను విక్రయించేస్తున్నారు. పంచాయతీకి ఇవ్వాల్సిన 10 శాతం కూడ స్థిరాస్తి వ్యాపారులు అమ్ముకుని జేబులు నింపుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. గ్రామాల్లో భూ మార్పిడి జరగకుండానే ఎకరాల కొద్దీ ప్లాట్లను విక్రయించే పరిస్థితి నెలకొంది. దీనిపై రెవెన్యూ, పంచాయతీ అధికారులు చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరం ఉంది. కానీ ఫిర్యాదులు వస్తే కాని పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

వ్యవసాయ భూమి గజాల్లో రిజిస్ట్రేషన్

వ్యవసాయ భూమి విక్రయిస్తే తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. భూమిలోని కొంత భాగాన్ని అమ్మితే, అందులో ఇల్లు కట్టుకోవాలంటే అనుమతి సమయంలో అది వ్యవసాయభూమి అని తేలుతుంది. అందుకు అనుమతి రాక కొన్నవారు అవస్థలు పడుతున్నారు. ముందుగా భూమిని గజాల్లో కొంటే ఆ తర్వాత ఏమి కావాలంటే అది చేస్తామంటూ వెంచర్ల నిర్వాహకులు గజాల చొప్పున విక్రయిస్తున్నారు. వ్యవసాయ భూమిని గజాల్లో అమ్మరాదన్న నిబంధన ఉన్నా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కొందరు మధ్యవర్తులు పైరవీలు చేసి రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల డీటీసీపీ లేని, పాత వెంచరును మార్చి ప్లాట్ల సంఖ్యలో బై వన్ అని రాసి విక్రయించిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఇప్పటికైనా కఠినంగా వ్యవహరించి ప్లాట్లు కొనుగోలుదారులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ అనుమతి లేకుండా వేసిన వెంచర్లలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దు. కొంత మంది అనుమతి ఉన్నట్లు తప్పుదారి పట్టిస్తారు. ఎవరూ నమ్మొద్దు. పాట్లు కొనుగోలు చేసే ముందు వెంచరుకు డీటీసీపీవో అనుమతి ఉందా, లేదా అని తెలుసుకొని కొనుగోలు చేసుకోవాలి. జిల్లాలో 16 వెంచర్లకు అనుమతులు ఉన్నాయి. అందులో కొన్నింటికి తాత్కాలిక అనుమతులు మాత్రమే ఉన్నాయి. అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
అన్సారి, డీటీసీపీవో, సిరిసిల్ల

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**- ఇంట్లో పురుగుల మందు తాగి బలవన్మరణం**



**గుడిహత్నూర్ ఫిబ్రవరి 24 (ప్రభాత సమాచారం)** అప్పుల బాధలు తాళలేక ఓ రైతు పురుగుల మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై ఇమ్రాన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాఇలా వున్నాయి. గుడిహత్నూర్ మండలం మన్నూర్ గ్రామానికి చెందిన కదం నారాయణ( 41 ) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ సంవత్సరం పంట దిగుబడి రాకపోవడంతో అప్పు చేశాడు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతుబంధు, రుణం మాఫీ, ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. అప్పు ఎలా తీర్చాలో తెలియక ఈనెల ఫిబ్రవరి 18 ఆదివారం మధ్యాహ్నం తన ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. ఆదిలాబాద్ రిమ్స్ లో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

## క్వారీ.. అక్రమాల స్వారీ

ఆసిఫాబాద్ : క్రషర్ నుంచి ముత్యంపేట వరకు రెండు కిలోమీటర్లమేర దారి అధ్వానంగా మారింది. వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము ధూళి కారణంగా ఊపిరి ఆడకుండా, ముందు వస్తున్నవారు కనిపించని పరిస్థితి నెలకొంది. కంకర క్వారీల్లో నిత్యం భారీ పేలుళ్లతో ఆయా గ్రామాల ప్రజలు హడలిపోతున్నారు. పంటచేలల్లో భారీ రాళ్లు వచ్చిపడుతున్నాయని కర్షకులు వాపోతున్నారు. పరిమితికి మించి కంకరను నింపి, క్రషర్లనుంచి వాహనాలు వెళ్లే మార్గాల్లో దుమ్ము చేలరేగడంతోపాటు, రహదారులపై పూర్తిగా తారులేచి కంకరమయంగా మారుతున్నాయి. గడువు ముగిసిన కొన్ని క్వారీల నుంచి కంకరను అక్రమంగా రాత్రిళ్లు తీసుకొస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పరిధికి మించి తవ్వకాలు సైతం సాగుతుండటం, సరకును ఎంత తరలిస్తున్నారని చెప్పే వేబ్రిడ్జిలు సైతం లేకపోవడం గనులశాఖలో చోటుచేసుకుంటున్న అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

జిల్లాలో కౌటాల మండలం ముత్యంపేట వద్ద 8 కంకర క్వారీలు ఉండగా, నాలుగు క్రషర్లున్నాయి. వీటితో ఈ ప్రాంత వాసులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. అన్నదాతల చేలల్లోనే ఇవి ఉండటంతో పేలుళ్లతో భారీ బండరాళ్లు వచ్చి పడి పంట మొత్తం నాశనమవుతుందని రైతులు చెబుతున్నారు. వాహనాలు వెళ్లే సమయంలో పంటలన్నీ దుమ్ముపట్టిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి సైతం పూర్తిగా గుంతలమయంగా మారింది. ఇక్కడి గుత్తేదారు సరకును చింతలమానేపల్లి మండలం గూడెం మీదుగా మహారాష్ట్రకు 60 కిలోమీటర్ల మేర, మరోవైపు కాగజ్‌నగర్‌నుంచి ఆసిఫాబాద్‌కు 28 కిలోమీటర్ల మేర తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మార్గాలన్ని దారుణంగా మారాయి.

పరిమితికి మించి..

కాగజ్‌నగర్ క్రాస్ రోడ్ వద్ద రాళ్లపేట శివారులో విస్తారంగా తెల్లసుద్ద క్వారీలు ఉన్నాయి. దాదాపు 200 ఎకరాల్లో 20 క్వారీలు ఉండేవి. ప్రస్తుతం నాలుగు క్వారీలు నడుస్తున్నాయి. సిరామిక్స్ పైపుల తయారీ పరిశ్రమలకు తెల్లసుద్దను తరలిస్తున్నారు. ఎంత తవ్వుతున్నారో, ఎంత తరలిస్తున్నారో లెక్క లేకుండాపోతోంది. సమీపంలో ఉన్న వేబ్రిడ్జి నాలుగు వరుసల రహదారి విస్తరణలో మూసేశారు. మళ్లీ ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో టన్నుకు రూ.40 చొప్పున గనులశాఖ వచ్చే రాయితీ దక్కకుండా పోతోంది. ఇటీవలే అధికారులు నిర్వహించిన తనిఖీల్లో 5 వేల క్యూబిక్ మీటర్ల వరకు అదనంగా తవ్వకాలు జరిపారని గుర్తించినా, ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. రహదారిని ఆనుకునే..కాగజ్‌నగర్–ఆసిఫాబాద్ అంతరాష్ట్ర రహదారిని ఆనుకునే ఈ క్వారీలకు అనుమతులు ఎలా ఇచ్చారనేది అంతుపట్టని విషయంలా మారింది. మూసివేసిన 16 క్వారీలు భారీ గోతులతో కనిపిస్తున్నాయి. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా, నేరుగా గోతుల్లో పడిపోవాల్సిందే. ఇవి వర్షాకాలం నీళ్లతో నిండడం వల్ల సమీప గ్రామాల ప్రజల పశువులు సైతం ఇందులో పడి చనిపోతున్నాయి. వాంకిడి మండలం నవేగూడలో ఉన్న కంకర క్వారీ అనుమతులు సైతం 2022లోనే ముగిసినా, గుత్తేదారు రాత్రిళ్లు గుట్టు చప్పుడు కాకుండా వాహనాల్లో కంకరను తరలించి సొమ్ము చేసుకుంటున్నాడు.

జరిమానా విధిస్తాంనాగరాజు, గనులశాఖ ఏడీ

తెల్లసుద్ద క్వారీల్లో హద్దుకు మించి గుత్తేదారు తవ్వకాలు జరిపారని గుర్తించాం. జరిమానా విధిస్తాం. త్వరలోనే ఈపీఎస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ సర్వే)ను నిర్వహిస్తాం. క్వారీలకు కేటాయించిన స్థలం విషయంలో కచ్చితత్వం వస్తుంది.

మిరప పంట నాశనమవుతోందితోగం పెంటు, ముత్యంపేట–కౌటాల

రెండున్నర ఎకరాల్లో మిరప పంట వేశాను. నా చేను పక్కనే క్వారీ ఉంది. నిత్యం రాత్రిళ్లు పేలుళ్లు జరుపుతున్నారు. భారీ రాళ్లు చేలో వచ్చిపడటంతో ఏటా పంట నాశనమవుతోంది. ఈ ప్రాంత పంట చేలన్నింటిదీ ఇదే పరిస్థితి. అధికారులకు మాకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

## ఇక పక్కాగా లెక్క..

చెన్నూరు : పట్టణాల్లో జీఐఎస్ (జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) సాంకేతికతతో సర్వే చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా పురపాలిక పరిధిలోని నివాస గృహాలకు మ్యాపింగ్ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు తాజాగా కేంద్ర ప్రభుత్వం బల్దియాలకు సూచన చేసింది. తాజాగా చేపట్టే సర్వేతో భవన నిర్మాణాల సంఖ్య, అనుమతులకు అనుగుణంగా నిర్మించారా.. లేదా? అనే విషయాలు తేటతెల్లమవుతాయి. డిజిటల్ రికార్డుల నిర్వహణతో పురపాలికలకు ఆదాయం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

**సునాయసంగా తెలుసుకునేలా..** పట్టణాల్లో వరదకాల్వలు, రహదారులు, తాగునీటి గొట్టపు మార్గాల వ్యవస్థ, అపార్ట్‌మెంట్లు, ఉద్యానవనాలు, పచ్చదనం, వాణిజ్య సముదాయాలు, ఇతర సమాచారం జీఐఎస్ సాంకేతికత సాయంతో గుర్తిస్తారు. పట్టణాల్లో వివిధ వార్డుల్లో ఇంటి నెంబర్లు, ఆయా కాలనీల ను గుర్తించేలా సర్వే చేపట్టనున్నారు. ప్రతి ఇంటిని సమీపంలో నుంచి చూసిన రీతిలో 3డీ పటాలు ఉంటాయి. ఆన్‌లైన్‌లో క్లిక్ చేయగానే భవన నిర్మాణ రూపం కళ్లముందు కనిపించేలా మ్యాపింగ్‌లో పొందు పర్చుతారు. ఎంత మేర విస్తీర్ణంలో నిర్మాణం ఉందో తెలుసుకునే వీలుంటుంది.

**పన్ను పరిధిలోకి వచ్చేలా..** ఏళ్ల నుంచి అనేక నిర్మాణాలు చేస్తున్నా కొందరు ఆస్తి పన్ను ఎగవేస్తున్నారు. తాజాగా చేపట్టే సర్వేతో పురపాలికల రికార్డుల్లో ప్రతి నిర్మాణాన్ని పొందుపరిచేలా యంత్రాంగం దృష్టి పెట్టింది. భవనాల స్వరూపంతో ఆయా ప్రాంతల్లో గుగూల్‌మ్యాప్ ద్వారా వివరాలు కనిపిస్తాయి. కేంద్ర, రాష్ట్ర స్థాయిలో చేపట్టే చర్యలపై ఎప్పటికప్పుడు నివేదిక సిద్ధం చేసే అవకాశాలు ఉంటాయి. వరద నీటి కాల్వలు, ఉద్యానవనాలు, రహదారుల పరిధి, పారిశ్రామిక వాడలు ఎలా ఉండాలో బల్దియాలు నిర్ణయం తీసుకునే వీలుంటుంది.

# సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికపై చర్చ




సికింద్రాబాద్: సిట్టింగ్ శాసనసభ్యురాలు లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. సభ్యులెవరైనా మరణిస్తే ఆరు నెలల్లోపు ఉప ఎన్నిక నిర్వహించాలని నిబంధన ఉంది.

అయితే, లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మరో 15 రోజుల్లో వెలువడనున్నదని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వాటితోపాటే కంటోన్మెంట్ ఉపఎన్నిక నిర్వహణ సాధ్యమా, కాదా.. అనే విషయమై స్థానికంగా తర్జనభర్జనలు పడుతున్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై ఈపాటికే అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించిన సంగతి విదితమే. ఇప్పటికిప్పుడే అసెంబ్లీ స్పీకర్ నుంచి రాష్ట్ర సీఈఓకు కంటోన్మెంట్ సీటు ఖాళీ అయ్యిందంటూ అధికారికంగా సమాచారం పంపడం, అక్కడి నుంచి కేంద్ర ఎన్నికల కార్యాలయానికి ఈ సమాచారం అందవలసి ఉంటుందని తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేలోపు ఈ ప్రక్రియ పూర్తయితే లోక్‌సభ ఎన్నికలతో పాటే కంటోన్మెంట్ ఉపఎన్నిక సాధ్యమవుతుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. షెడ్యూల్ విడుదలైన తర్వాత కూడా కంటోన్మెంట్ ఉప ఎన్నికకు సంబంధించి ప్రత్యేక షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# ఆ లోపంతోనే పటాన్‌చెరు అభివృద్ధి చెందలేదు



సంగారెడ్డి, ఫిబ్రవరి 24: పాలకుల చిత్తశుద్ధి లోపంతోనే ఆసియాలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతం పఠాన్ చెరు ఏలాంటి అభివృద్ధి చెందలేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘుందన్ రావు విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... ఈదుల నాగులపల్లిలో రైల్వే టెర్మినల్ భూసేకరణ వద్దే ఆగిపోవటం విచారకరమన్నారు. 153 కిలోమీటర్ల రింగ్ రోడ్డు నిర్మాణం సాధ్యమైనా కొల్లూరు వద్ద కిలోమీటర్ సర్వీస్ రోడ్డును ఇవ్వలేకపోవటం బాధాకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి రియల్ ఎస్టేట్ మీద ఉన్న ప్రేమ సర్వీస్ రోడ్డు నిర్మాణం పై లేదని మండిపడ్డారు. పటాన్ చెరులో గొప్ప లాండ్ బ్యాంకు ఉన్నా ఐటి సెజ్ అభివృద్ధి చేయలేదన్నారు. లక్డారంలో క్రషర్ల రూపంలో గుట్టలను, కొండలను కరిగించేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకే ప్రజలు పట్టం కడతారని రఘునందన్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# చెరకు సాగు, నిజాం షుగర్ ఫ్యాక్టరీ ప్రారంభం ఒకేసారి: శ్రీధర్ బాబు



హైదరాబాద్: ఐదేళ్లలో రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) పూర్తి చేస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు సిఫార్సుల కమిటీ సందర్శించింది. ఛైర్మన్ శ్రీధర్ బాబు, సభ్యులు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి.. రైతులు, కార్మికులు, రాజకీయ పక్షాల అభిప్రాయాలను తెలుసుకున్నారు. చక్కెర పరిశ్రమను ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోందని శ్రీధర్‌బాబు తెలిపారు. చక్కెర పరిశ్రమ ప్రారంభం, చెరకు సాగు ఒకేసారి జరగాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పరిశ్రమ పునరుద్ధరణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు. లాభాల్లో ఉండే విధంగా ఫ్యాక్టరీని తిరిగి తెరిపించేందుకు ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. చెరకు రైతులకు పర్చేస్ ట్యాక్స్, సబ్సిడీని పరిశీలిస్తున్నామని, ట్రాన్స్ పోర్టు సబ్సిడీ, కొత్త వంగడాలపై దృష్టి సారించామని తెలిపారు.

# కంటోన్మెంట్ ఎమ్మెల్యే ప్రమాద ఘటన.. ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్: ప్రజా జీవితంలో నిత్యం తీరిక లేకుండా గడిపే రాజకీయ నాయకులు సమయం చూసుకోకుండా ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. ఇదే ఒక్కోసారి వారి ప్రాణాల మీదకు తెస్తోంది. తాజాగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే ప్రమాద ఘటనతో ప్రముఖుల ప్రయాణాలపై చర్చ జరుగుతోంది. ఇదే అంశంపై రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. వీఐపీల డ్రైవర్లందరికీ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిపారు. సుమోటోగా తీసుకుని ఈ కార్యక్రమం చేపడుతున్నట్టు వెల్లడించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో రవాణాశాఖ ఎక్కడికక్కడ ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతిభ లేని డ్రైవర్లను విధుల్లో పెట్టుకోవద్దని మంత్రి సూచించారు.

# 'హత్యలు చేయటమే ఇందిరమ్మ రాజ్యమా?'



హైదరాబాద్: తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతుంది అని కాంగ్రెస్ చెప్తోందని, నిజంగానే ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ప్రశ్నిస్తే దాడులు, నిర్బంధాలు, ఎదురిస్తే కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ మండిపడ్డారు. ఆయన శనివారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. 'జర్నలిస్ట్ శంకర్‌పైన దాడి చేసి హత్య చేసే ప్రయత్నం చేశారు. సాయి రామ్ రెడ్డి హస్తినాపురం కాంగ్రెస్ ప్రెసిడెంట్‌కి చెందిన అనుచరుడు. పథకం ప్రకారం శంకర్‌ను చంపాలని చూశారు. గొడవపడినట్టు ఇద్దరు మహిళలను పెట్టి పథకం ప్రకారం చేశారు. పాశవికంగా శంకర్‌పై దాడి జరిగింది. ఈ దాడిని అందరూ ఖండించాలి. ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?. అక్షరంతో ప్రశ్నిస్తే అయుధంతో దాడులు చేస్తారా?. హత్యలు చేయటమే ఇందిరమ్మ రాజ్యమా?'అని బాల్క సుమన్ ప్రశ్నించారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194




# పూర్తిస్థాయిలో నీటిపారుదల శాఖ ప్రక్షాళనపై సర్కారు దృష్టి

**నీటిపారుదల శాఖను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయడంతోపాటు పునర్వ్యవస్థీకరణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈఎన్సీల స్థాయిలో ఇప్పటికే చర్యలు చేపట్టిన ప్రభుత్వం.. తాజాగా శాఖకు మరో కార్యదర్శిని కూడా నియమించింది. సివిల్ ఇంజనీరింగ్ చదివిన ఐఏఎస్ అధికారి పాటిల్ ప్రశాంత్ జీవన్‌ను ప్రత్యేక కార్యదర్శిగా నియమించింది.**




# తుది దశకు అభ్యర్థుల జాబితా!.. ఢిల్లీకి తెలంగాణ బీజేపీ నేతలు

ఢిల్లీ: బీజేపీ హైకమాండ్ తెలంగాణపై మరోసారి ఫోకస్ పెట్టింది. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై కసరత్తు ప్రారంభించింది. ఈ క్రమంలోనే నేడు ఢిల్లీలో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ తర్వాత అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది. దీంతో, రాష్ట్ర బీజేపీ నేతలు హస్తినకు బయలుదేరారు. కాగా, బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జేపీ నడ్డా తెలంగాణ అభ్యర్థుల ఎంపికపై చర్చించనున్నారు. ఇక, లోక్‌సభకు అభ్యర్థుల ఎంపిక చివరి దశకు వచ్చినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా 17 ఎంపీ స్థానాల్లో సగం సీట్లకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు. బీజేపీ గెలిచిన నాలుగు ఎంపీ సీట్లలో మూడింటిలో సిట్టింగ్ ఎంపీలను బరిలోకి దింపడంతో పాటు (ఆదిలాబాద్ మినహా), చేవెళ్ల, మహబూబ్‌నగర్, మల్కాజిగిరి, భువనగిరి, మెదక్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. నేడు దాదాపు ఒక్కొక్క అభ్యర్థిని ఫైనల్ చేయనుంది. ఇక, ప్రతీ నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థుల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఇక, బీజేపీ కీలక భేటీ నేపథ్యంలో రాష్ట్ర నేతలు ఢిల్లీకి బయలుదేరారు. రాష్ట్ర బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఈటల రాజేందర్, లక్ష్మణ్, డీకే అరుణ హస్తినకు పయనమయ్యారు. కాగా, అభ్యర్థుల ఎంపికపై వీరు అధిష్టానంలో తుది చర్చలు జరుపనున్నారు. మార్చి రెండో వారంలో అభ్యర్థుల ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

**ఎవరెవరు ఎక్కడెక్కడంటే..** ప్రస్తుతమున్న పరిస్థితుల్లో వీరికి టికెట్లు ఖరారు కావొచ్చునని, కొన్ని స్థానాల్లో ఆయా నేతలు టికెట్ కోసం పోటీకి ఆసక్తి చూపిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

సికింద్రాబాద్: కిషన్‌రెడ్డి, కరీంనగర్: బండి సంజయ్ , నిజామాబాద్: అర్వింద్ ధర్మపురి, ఆదిలాబాద్: సోయంబాపూరావు లేదా బాపూరావు రాథోడ్, గుడెం నగేష్, మల్కాజిగిరి: ఈటల రాజేందర్, మురళీధర్‌రావు, చాడ సురేష్ రెడ్డి, టి.వీరేందర్‌గౌడ్, పొన్నా ల హరీష్రెడ్డి, జహీరాబాద్: ఎం.జైపాల్‌రెడ్డి, ఆలె భాస్కర్, అశోక్ ముస్తాపురె / ఓ ప్రముఖ సినీ నిర్మాత, చేవెళ్ల: కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గవర్నర్ బండారు దత్తాత్రేయ వియ్యంకుడు బి. జనార్ధనరెడ్డి, మహబూబ్‌నగర్: డీకే అరుణ, ఏపీ జితేందర్‌రెడ్డి, శాంతకుమార్, భువనగిరి: బి.నర్సయ్యగౌడ్, జి. మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు యాదవ్, శ్యాంసుందర్‌రెడ్డి, మెదక్: ఎం.రఘునందన్‌రావు, జి. అంజిరెడ్డి , వరంగల్: మాజీ డీజీపీ కృష్ణప్రసాద్, చింతా సాంబమూర్తి , నాగర్‌కర్నూల్: బంగారుశ్రుతి, కేఎస్ రత్నం, హైదరాబాద్: టి.రాజాసింగ్, మాధవీలత, భగవంతరావు, పెద్దపల్లి: టి.కుమార్ లేదా ఎవరైనా కొత్త నేతకు అవకాశం, నల్లగొండ: మన్నె రంజిత్‌యాదవ్ లేదా పార్టీలో చేరే మరో నాయకుడికి, మహబుబాబాద్: హుస్సేన్‌నాయక్ / మరొకరికి, ఖమ్మం: దేవకీ వాసుదేవరావు, వినోద్‌రావు, రంగా కిరణ్ .

# జీవో 317పై కేబినెట్ సబ్ కమిటీ.. ఛైర్మన్‌గా రాజనర్సింహ



హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తజోన్లు, కొత్త జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగుల సర్దుబాటు కోసం ఉద్దేశించిన జీవో 317పై ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

ఉద్యోగుల అభ్యంతరాల దృష్ట్యా ఈ జీవోపై మంత్రి వర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది.


కేబినెట్ సబ్‌కమిటీ ఛైర్మన్‌గా మంత్రి దామోదర రాజనర్సింహ, సభ్యులుగా మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఉన్నారు. 2021లో ఇచ్చిన 317 జీవోపై వివాదాలు, ఉద్యోగుల అభ్యంతరాలపై కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి సిఫార్సులు చేయనుంది.

# మేడారం జాతరకు 1.35 కోట్ల మంది భక్తులు: మంత్రి సీతక్క



ములుగు: మేడారం జాతర విజయవంతం కోసం కృషి చేసిన ప్రజలు, అధికారులకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. దాదాపు 1.35 కోట్ల మంది భక్తులు సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్నారని చెప్పారు. శనివారం మేడారంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. మేడారంలో వసతుల కోసం రాష్ట్రప్రభుత్వం రూ.100 కోట్ల నిధులు కేటాయించిందని వెల్లడించారు. "20శాఖల అధికారులు జాతర పనుల్లో కష్టపడి పనిచేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా మా వంతు కృషి చేశాం. జాతరకోసం ఆర్టీసీ దాదాపు 6వేల బస్సులను కేటాయించి.. 12వేల ట్రిప్పులు నడిపింది. మహాజాతరకు వచ్చిన భక్తుల్లో 5090 మంది తప్పి పోయారు. వారిలో 5062 మందిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించాం. ఇంకా 32 మంది చిన్నారులు అధికారుల వద్ద జాగ్రత్తగా ఉన్నారు. వారిని కూడా కుటుంబీకులకు క్షేమంగా అప్పగిస్తాం. తప్పిపోయిన వారి వివరాల కోసం మీడియాపాయింట్ , జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన మిస్సింగ్ పాయింట్‌లో సంప్రదించాలి. సోమవారం నుంచి మేడారంలో పది రోజుల పాటు పారిశుద్ధ్య పనులు జరుగుతాయి. ఇందుకోసం దాదాపు 4వేల మంది కార్మికులను నియమించాం" అని మంత్రి వివరించారు.

# వారితో కాంగ్రెస్ ప్రభుత్వం లోపాయికారి ఒప్పందం చేసుకుంది



హైదరాబాద్: తెలంగాణ సంపద దోచుకున్న బీఆర్ఎస్ నేతలతో కాంగ్రెస్ ప్రభుత్వం లోపాయికారి ఒప్పందం చేసుకుందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. శనివారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.... తెర వెనుక కుట్రలు, కుమ్మక్కు రాజకీయాలు బీఅర్ఎస్, కాంగ్రెస్‌కు అలవాటు అయ్యాయని ఆరోపించారు. బీజేపీ చెప్పిందే చేస్తుందని.. ఏ విషయనైనా బహిరంగంగా చెబుతుందని అన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణిపై సీబీఐతో విచారణ చేయిస్తామని రేవంత్ చెప్పారని.. ఇప్పుడెందుకు కాలయాపన చేస్తున్నారని నిలదీశారు. బీఆర్ఎస్‌తో బీజేపీ ఎప్పటికీ పొత్తు ఉండదని... పార్లమెంట్ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని స్పష్టం చేశారు. గెలిచే గుర్రాలను 17 ఎంపీ స్థానాల్లో నిలపెట్టబోతున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చరిష్మాతో కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660